మొక్కల ఉత్పత్తిలో వెనుకంజ!

- నాడు మొక్కలు లక్షలు..నేడు వేలల్లో
- రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన భీమారం నర్సరీపై నిర్లక్ష్యం



మొక్కలు లేక వెలవెలబోతున్న గ్రీన్‌షెడ్



భీమారం సెంట్రల్ నర్సరీలో పైకప్పు ఎగిరిపోయిన షెడ్డు

భీమారం: అటవీశాఖ ఆధ్వర్యంలో భీమారం సెంట్రల్ నర్సరీ నేడు మొక్కల ఉత్పత్తి వెనుకంజలో ఉంది. నాడు లక్షల్లో మొక్కలు నాటగా నేడు వేలల్లో పరిమితమైంది. రాష్ట్రస్థాయి గుర్తింపుపొందిన నర్సరీ ప్రస్తుతం ఆదరణ లేక నిర్లక్ష్యానికి గురైంది. మంచిర్యాల డివిజన్ పరిధి భీమారం అటవీప్రాంతంలో 45 ఏళ్ల క్రితం మొక్కల పెంపకం చేపట్టారు. ఇక్కడి నర్సరీలో పెంచే మొక్కలకు అవసరమైన విత్తనాలను స్థానిక అడవుల్లో సేకరిస్తుంటారు. ప్లాంటేషన్‌లో భాగంగా బట్టదనం, ఇరికి, ఏరుమద్ది, వేప, నల్లమద్ది, కర్క, పాశి, నెమిలినార మొక్కలు పెంచుతుంటారు. వాటిని వివిధ అడవులకు తరలించేవారు. అయితే అడవుల్లో ప్లాంటేషన్ కోసం, జిల్లాలో హరితహారంలో భాగంగా వివిధ అవసరాలకు ఈ నర్సరీ నుంచే మొక్కలు తరలించారు. ప్రభుత్వం పంచాయతీల ద్వారా హరితహారం నర్సరీలు ప్రారంభించడం కూడా నర్సరీపై ప్రభావం పడింది.

10 లక్షల మొక్కల పెంపకం..

అటవీశాఖ గత ఐదేళ్లలో నర్సరీలో ఏడాదికి కేవలం 3 లక్షల వరకు మొక్కల పెంపకం చేపట్టింది. నర్సరీలో సక్సెస్ రేట్‌ను పరిగణనలోకి తీసుకున్న అనంతరం 10 లక్షల వరకు మొక్కలు పెంచారు. నర్సరీ సమీపంలోని వాగు వద్ద గల బావి, మరో బోరు ద్వారా మొక్కలకు నీటిని అందించారు.

నిరుపయోగంగా షెడ్లు

నర్సరీలో మొక్కలు పెంచేందుకు అటవీ అధికారులు భీమారంలో లక్షల రూపాయలతో పాలిహౌజ్, గ్రీన్‌షెడ్లు, సెంద్రి ఎరువు యూనిట్ నిర్మించారు. అవి నేడు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ఎప్పటికప్పుడు మొక్కలకు నీటిని అందిస్తూ ఎండ తగులకుండా కూలర్లు ఏర్పాటు చేశారు. గత రెండేళ్లుగా అవి నిరుపయోగంగా ఉంటున్నాయి. అందులో ఒక షెడ్డు పైకప్పు మొత్తం లేకుండా పోయింది.

టార్గెట్ లేక తగ్గిన ఉత్పత్తి

రెండేళ్ల నుంచి నర్సరీలో కేవలం లక్షలోపే మొక్కలు పెంచుతున్నారు. ప్రభుత్వం నుంచి టార్గెట్ నిర్దేశించకపోవడంతో మొక్కల ఉత్పత్తి తగ్గిందని అటవీశాఖ అధికారులు అంటున్నారు. జిల్లావ్యాప్తంగా పేరు ఉన్న నర్సరీలో మొక్కలు పెంచి వివిధ ప్రాంతాలకు పంపిణీ చేసే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో నర్సరీలో మొక్కలు లేక బోసిపోయి దర్శనమిస్తుంది. మొక్కల ఉత్పత్తి తగ్గించడంతో కూలీలు నష్టపోతున్నారు. కాగా, గతమూడేళ్ల క్రితం బ్యాగుల్లో నాటిన మొక్కలు వర్షాకాలంలో తరలించకపోవడంతో అవి నర్సరీకే పరిమితమయ్యాయి.

టార్గెట్ లేకనే..

భీమారం సెంట్రల్ నర్సరీకి ప్రభుత్వం నుంచి టార్గెట్ రానందున ఉత్పత్తి తగ్గించాం. ఉన్నతాధికారులతో మాట్లాడి మొక్కల పెంపకం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– రత్నాకర్‌రావు అటవీశాఖ రేంజ్ ఆఫీసర్, మంచిర్యాల

తొలగించిన భారీ వృక్షాల పరిశీలన



పరిశీలిస్తున్న డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

సాక్షి స్పందన

మందమర్రిరూరల్: 'భారీ వృక్షాల తొలగింపు 'శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఫారెస్ట్ అధికారులు స్పందించారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్ ఎఫ్‌బీవో రజితతో కలిసి వెంకటాపూర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ప్రహరీ నిర్మాణం పేరిట తొలగించిన వృక్షాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ సమక్షంలో కాంట్రాక్టర్‌ను విచారించారు. అనంతరం సంతోష్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో ఎలాంటి అనుమతి లేకుండా ఎనిమిది వృక్షాలను తొలగించినట్లు గుర్తించామని, దానికి కారకులైన వారిపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

ఓటరు అవగాహన సదస్సులు నిర్వహించాలి



ఈఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో బూత్‌స్థాయిలో ఓటరు అవగాహన సదస్సులు నిర్వహించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి కోరారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో చెన్నూర్ ఈఆర్వో చంద్రకళకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు పట్ల అవగాహన లేక యువ ఓటర్లు నమోదు చేసుకోవడం లేదని తెలిపారు. చిరునామా మార్పులు తదితర సమస్యలతో కొందరు తమ ఓటును వినియోగించుకోవడం లేదన్నారు. బూత్ స్థాయిలో బీఎల్వోల ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తే ఓటు హక్కు వినియోగం పెరుగుతుందన్నారు. బీజేపీ నాయకులు ఉన్నారు.

ఒంటిపూటకు తెరుచుకోని పాఠశాలలు



పెద్దపూర్‌లో వేచి చూస్తున్న టీచర్

కాసిపేట: మండలంలో శనివారం ఒంటిపూట బడులు ప్రారంభమైనా సమయానికి తెరుచుకోలేదు. కొన్నిచోట్ల సమయపాలన కరువైంది. ఉదయం 8 గంటలకు తరగతులు ప్రారంభించాల్సి ఉండగా ప్రాథమిక పాఠశాలలు ఆలస్యంగా తెరుచుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు లేటుగా వచ్చారు. సింగిల్ టీచర్ ఉన్న బడులు ఉదయం 8.45 గంటల మధ్య ప్రారంభమయ్యాయి. ఐటీడీఏ పాఠశాలలు 8.15 గంటల తర్వాత తెరుచుకున్నాయి. ఈవిషయమై డీటీడీవో అంబాజీని వివరణ కోరగా, హోలీ పండుగ, శనివారం తొలిరోజు ఒంటిపూట బడి కావడంతో ఇలా జరిగి ఉండొచ్చని అన్నారు. సిబ్బంది లేని చోట ప్రత్యామ్నాయంగా వేరే వారిని నియమిస్తామని తెలిపారు.

రోడ్ల పక్కన షాపులు నిర్వహిస్తే చర్యలు

బెల్లంపల్లి: రోడ్ల పక్కన షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపారు. బెల్లంపల్లి బజారుఏరియా ప్రధాన రహదారి పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులు, తోపుడు బండ్లను శనివారం పోలీసులు తొలగించే చర్యలు చేపట్టారు. పాత బస్టాండ్ ఏరియా చౌరస్తా వద్ద నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డు పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులు, తోపుడు బండ్లను తొలగించాలని ఎస్‌హెచ్‌ఓ నిర్వాహకులను ఆదేశించారు. కొన్నింటిని తొలగించారు. వ్యాపారులు సహకరించాలని కోరారు.

బెంచీలు అందజేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని గొల్లగూడెం, చెల్లాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 20 బెంచీలు అందజేశారు. ట్రస్ట్ అధినేత, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో శనివారం ఒక్కో పాఠశాలకు 10 బెంచీల చొప్పున అందజేసినట్లు వివేక్ యువసేన నాయకుడు రవికుమార్ తెలిపారు. విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు అందించినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన



రైతులకు సూచనలు చేస్తున్న ఏఈవో

నెన్నెల: మండలంలోని మన్నెగూడంలో యాసంగి వరి పంటలను ఏఈవో రాంచందర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు కారటప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు, ప్లోరాంతనిల్‌ప్రోల్ 0.3 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వరిలో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు ప్లస్ టెట్రాసైక్లిన్, హైడ్రోక్లోరైడ్ 1:9లో 0.2 గ్రాములు కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలన్నారు.

అట్రాసిటీ కేసులో ఒకరి రిమాండ్

మంచిర్యాలక్రైం: లక్సెట్టిపేటకు చెందిన ఓ మహిళ ఇంటికి ఈనెల 11న వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించిన కాంగ్రెస్ నాయకుడు బొప్పు సతీశ్‌పై లక్సెట్టిపేట పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈమేరకు శనివారం సతీశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

ఓటరు జాబితాకు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్



మాట్లాడుతున్న కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఓటరు జాబితా రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. జిల్లాలోని నస్పూర్‌లో సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ ఈఆర్‌వోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, డి చంద్రకళ, ఎన్నికల విభాగం అధికారి కేవై ప్రసాద్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. దరఖాస్తు ఫారాలు 6,7,8 ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పు, చేర్పులు, తొలగింపులపై వచ్చే దరఖాస్తులు పరిష్కరించడంపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించాలని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 271, బెల్లంపల్లి పరిధిలో 419, మంచిర్యాల పరిధిలో 596 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మూడు రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలు అందించాలన్నారు. ఒక కుటుంబానికి చెందిన అర్హత గల ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రాజారంలో నీటి కష్టాలు



ఖాళీబిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

కోటపల్లి: మండలంలోని రాజారంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఎస్సీ, ఎస్టీ కాలనీలో సుమారు వందకు పైగా ఇళ్లు ఉన్నాయి. ఇక్కడే ఉన్న బోరుమోటారు చెడిపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కాలనీవాసులు శనివారం ఖాళీబిందెలతో నిరసన తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌ని వివరణ కోరగా మరమ్మతుకు నిధుల కొరత ఉందన్నారు. వాటర్ ట్యాంక్‌తో నీటిని సరఫరా చేయిస్తామని తెలిపారు.

తీన్మార్ మల్లన్నను కలిసిన బీసీ జేఏసీ నాయకులు



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో బీసీ జేఏసీ నాయకులు

పాతమంచిర్యాల/జైపూర్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను జిల్లా బీసీ జేఏసీ నాయకులు శనివారం హైదరాబాద్‌లో కలిసి సమావేశమయ్యారు. బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా రిజర్వేషన్ల స్థాపనకు ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తీన్మార్ మల్లన్న సూచించారు. బీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు జానయ్య, జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి మనోహర్, నాయకులు గణేశ్, మల్లేశ్, వెంకటేశ్వర్లు, రవీందర్, ఎండీ లతీఫ్ పాల్గొన్నారు.

సన్మానం



రంజిత్‌ను సన్మానిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ

మందమర్రిరూరల్: పట్టణంలోని యాపల్ ఏరియాకు చెందిన రాందేని రంజిత్ గ్రూపు–2, 3 ఫలితాల్లో సత్తాచాటి ఎంపికయ్యాడు. శనివారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తన కార్యాలయంలో అయన్ను సన్మానించారు. గ్రూప్–3లో రాష్ట్రస్థాయిలో 17, గ్రూప్–2లో రాష్ట్రస్థాయిలో 13వ ర్యాంకు సాధించాడు

సంక్షిప్త వార్తలు

లయన్స్‌క్లబ్ కార్యవర్గం

జైపూర్: మండల కేంద్రంలో మండల నూతన లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్ల సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మంతెన లక్ష్మణ్, కోశాధికారిగా ముదాం రమేశ్‌తోపాటు 34 మంది సభ్యులతో నియమించినట్లు రామగుండం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు ప్రమోద్‌రెడ్డి, రాజేందర్ తెలిపారు.

అక్రమ మట్టి తవ్వకాన్ని పరిశీలించిన డీఈ

కాసిపేట: మండలంలోని కోమటిచేను శివారు సల్పాలవాగు చెరువు కట్ట కింద అక్రమంగా మట్టి తవ్వకాలను ఇరిగేషన్ డీఈ నరేశ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఆయన వెంట జేఈ అశోక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసరి శంకర్ ఉన్నారు.

పరామర్శ

తాండూర్: మాదారం శ్రీ ఇంక్‌లైన్‌కు చెందిన గీత కార్మికుడు బుర్ర శేఖర్‌గౌడ్ కొన్నినెలల క్రితం ఈత చెట్టు ఎక్కబోతూ కింద జారిపడ్డాడు. కాలికి గాయమై రియాక్షన్ కావడంతో వైద్యులు తొలగించారు. ప్రస్తుతం ఇంట్లో ఉన్న శేఖర్ గౌడ్‌ను గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ నాయకులు పరామర్శించారు. నాయకులు మొండిగౌడ్, భాస్కర్ గౌడ్, రమేశ్‌గౌడ్, పున్నం గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్ ఉన్నారు.

కస్టమర్ సేవా కేంద్రం ప్రారంభం

కోటపల్లి: మండలంలోని నక్కలపల్లి పంచాయతీ పరిధిలో టీజీబీ ఆధ్వర్యంలో కస్టమర్ సేవా కేంద్రాన్ని మేనేజర్ రాజేశ్ శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన మానెపల్లి లక్ష్మీని బ్యాంకుమిత్రగా నియమించారు. ఈ కేంద్రం ద్వారా వివిధ రకాల బ్యాంక్ సేవలు పొందవచ్చన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

లక్సెట్టిపేట: మండలంలోని సూరారం సబ్‌స్టేషన్ పరిధిలోని గుల్లకోట, పోతపల్లి, అంకత్‌పల్లి, సూరారం, లక్ష్మీపూర్, ఇటిక్యాల గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ గణేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మతు కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల రిలే దీక్ష



రిలేనిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాకేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణ అమలు చేస్తామని మాట ఇచ్చారన్నారు. వర్గీకరణ జరగకుండానే గ్రూప్–1,2,3 ఫలితాలు విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆదేశాలతో రిలే దీక్ష చేపట్టినట్లు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెల్లంపల్లి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దిష్టిబొమ్మను బె ల్లంపల్లిలో కాంగ్రెస్ నాయకులు శనివారం దహనం చేశారు. పట్టణంలోని సర్దార్ భగత్‌సింగ్ చౌరస్తావద్ద సామూహికంగా తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదా లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మ న్ ఎం.సూరిబాబు, డీసీసీ ప్రధాన కార్యదర్శి జి.జ యరాం, కాంగ్రెస్ నాయకులు సిలువేరు సత్యనారా యణ, రాజలింగు, నయీమ్, కటకం సతీశ్, ఎనగందుల వెంకటేశ్, ఆనంద్, పలువురు మాజీ కౌన్సెలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి గడ్డి దగ్ధం

వేమనపల్లి: మండలంలో మారుమూల బొమ్మెన గ్రామానికి చెందిన దాగామ లక్ష్మణ్ తన పెరటిలో శనివారం చెత్త కుప్పకు నిప్పు పెట్టాడు. మంటలార్పివేసి ఇంట్లో వెళ్లాడు. నిప్పు పక్కనే ఉన్న వరి గడ్డి వాము, పందిరికి అంటుకుంది. అక్కడే కట్టేసి ఉన్న మూడు ఎడ్లు మంటల్లో చిక్కుకున్నాయి. మంటల వేడికి తట్టుకోలేక మౌనంగా రోదించాయి. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు గమనించి విద్యుత్ మోటారుతో మంటలార్పే ప్రయత్నం చేశారు. అప్పటికే తీవ్ర గాయాలపాలైన ఒక ఎద్దు మృతి చెందగా రెండు ఎడ్లు ప్రాణాలతో బయటపడ్డాయి. పశువైద్యాధికారులు సుప్రియ రెడ్డి, పవన్‌కుమార్‌లు గాయపడిన రెండు ఎడ్లకు వైద్యం అందించారు.

దొంగల హల్‌చల్

మంచిర్యాలక్రైం: జిల్లాలో వరుసగా దోపిడీ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. ఈ నెల 12న ఇందారం చౌరస్తా సమీపంలో యువ జంటపై కొందరు గుర్తుతెలియనివ్యక్తులు దాడిచేసి దోపిడీకి పాల్పడిన ఘటన మరిచిపోక ముందే శనివారం జిల్లా కేంద్రంలో మరో ఘటన కలకలం రేపింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని బెల్లంపల్లిచౌరస్తా ప్రాంతానికి చెందిన ప్యాగ పోశం(40) ప్రభుత్వ ఉద్యోగి. ఈనెల 14న తన స్నేహితులతో కలిసి మధ్యాహ్నం ఇందు బార్‌లో మద్యం తాగారు. తర్వాత పోశం బయటకు రాగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా లిఫ్ట్ అడిగి ఎక్కాడు. కొద్దిగా ముందుకు వెళ్లాక మరోవ్యక్తిని బైక్‌పై ఎక్కించుకొని పోశంను లక్సెటిపేట వైపు వెళ్లాడు. మ్యాదరివాడ సమీపంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో చంపుతామని బెదిరించి ఆయనమెడలో తులం బంగారు చైను ఎత్తుకెళ్లి పారిపోయారు. బాధితుడు ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఐకే1ఏ గనిని సందర్శించిన ఏఐటీయూసీ నేతలు



మాట్లాడుతున్న వీరభద్రయ్య, సమ్మయ్య

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే1ఏ గనిని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు శనివారం సందర్శించారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమయ్య, కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య.. గనిలో కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం వారు మాట్లాడుతూ కార్మికులు పనిచేసే పనిప్రదేశాల్లో రక్షణ పరికరాలు, పనిముట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నిర్మాణంలో ఉన్న షెడ్డును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఓసీలోని సమస్యల గురించి, కార్మికుల వాహనాల పార్కింగ్ కోసం షెడ్లు ఏర్పాటు చేయాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిష్కరిస్తామన్నారు. ఫిట్‌సెక్రెటరీ నవీన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, అఫ్రోజ్‌ఖాన్, సతీశ్, సురేశ్, శ్రీకాంత్, వెంకటేశ్, కేశవ్, తదితరులు ఉన్నారు.

జీఎంను కలిసిన ఐఎన్టీయూసీ నాయకులు



జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్‌ను ఐఎన్టీయూసీ నాయకులు కలిశారు. నూతన జీఎంగా ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ బి.జనక్‌ప్రసాద్ శనివారం జీఎం కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఏరియా కమిటీ నాయకులను జీఎంకు పరిచయం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గరిగే స్వామి, నాయకులు తిరుపతిరాజు, ల్యాగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



గిరిజనులకు సరుకులు అందిస్తున్న డీసీపీ, ఏసీపీ

తాండూర్: విద్యతోనే గిరిజనులకు బంగారు భవిష్యత్ ఉంటుందని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు. శనివారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా రాబిన్ హుడ్ ఆర్మీ స్నోమ్యాన్ సహకారంతో 365 మంది ఆదివాసీ గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. డీసీపీ మాట్లాడుతూ యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తాండూర్ సీఐ కుమారస్వామి, మాదారం ఎస్సై సౌజన్యని అభినందించారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, ఎస్సైలు కిరణ్‌కుమార్, గంగారాం, విజయ్ పాల్గొన్నారు.

కనువిందుగా.. పైరు పచ్చ



దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరి వంతెన సమీపంలో నదీ తీరాన్ని ఆనుకుని పొలాల్లో వరి పైరు పచ్చదనంతో కళకళాడుతున్నాయి. రహదారి గుండా ప్రయాణించే వారికి కనువిందు చేస్తున్నాయి.